# పెన్ ఫ్రెండ్

## అడుసుమల్లి మల్లికార్జున

రాత్రి మూర్తి అడిగిన ప్రశ్న సుమతి మనసును కకావికలు చేసేసింది నిద్ర కూడ సరిగా పట్టలేదు ఆలోచిస్తూనే వుండి పోయింది

పెళ్ళియేడాది గడిచినా ఎప్పుడూ మూర్తి అట్లా అడగలేదు. అతడు అడిగిన మాట యదాలాపంగా అడిగినట్టు అనిపించలేదు సుమతికి కావాలని అడిగినట్టు గానే వుంది

'సుమతీ! నీకు ఫ్రెండ్స్ ఎవ్వరూ లేరా?" పడుకునే ముందు అడిగాడు –మూర్తి

"చెప్పుకోతగ్గ ఫ్రెండ్స్ ఎవ్వరూ లేరులెండి' నవ్వుతూనే అంది సుమతి

మూర్తి పరిశీలనగా చూస్తూ–

'కనీసం పెన్ ఫ్రెండ్స్ కూడా లేరా?' అన్నాడు

ఆ మాటతో వులిక్కి పడింది సుమతి

మూర్తి చూపులు తప్పించుకుంటూ లేరన్నట్టు తల మాత్రం అడ్డంగా వూపింది

అంతే జరిగింది

మూర్తి నిద్రపోయాడు

సుమతిని మాత్రం నిద్రాదేవత కరుణించలేదు. భర్త అడిగిన ఆమాట సూటిగా హృదయాన్ని తాకింది

నిజంగా తనకి చెప్పుకోతగ్గ ఫ్రెండ్స్ ఎవ్వరూ లేరు వున్నా– రైలు ప్రయాణీకుల్లా మధ్యలో వచ్చి మధ్యలో నే వెళ్ళి పోయేరు కాని పెన్ ఫ్రెండ్స్?

ఐదు వసంతాలకు పైగా వుత్తరాల ద్వారా తనతో. స్నేహించి, స్నేహ మాధుర్యాన్ని చవిచూపించి, మానసికంగా తన్ను ఎంతో వృద్ధి చేసిన ఆ పెన్ ఫ్రెండ్ని మరువగలదా? మరచి పోయినట్టు నటించడం ఆత్మద్రోహమే అవుతుంది. మరి ఆ ప్రశ్నకు సమాధానం ఎందుకు చెప్పలేక పోయింది తను? అనవసరంగా అబద్ధం కూడ చెప్పేసింది తన ప్రవర్తనకు తనకే సిగ్గేసింది

కట్నం కోసం కాట్లకుక్కల్లా పోట్లాడు కుంటున్న ఈ రోజుల్లో – అందం, చదువు, ఉద్యోగం అన్నీ వున్న మూర్తి పైసా కట్నం లేకుండా ఆదర్శ వివాహం చేసుకున్నాడు మూర్తి అంటే ప్రేమతో బాటు అభిమానం కూడ కలిగింది సుమతికి. సుమతిని కూడా మూర్తి ఎంతో ఇష్టంగా చూసుకుంటున్నాడు

అట్లాంటి భర్తకు అనవసరంగా అబద్ధం చెప్పినందుకు ఎంతో బాధ పడింది సుమతి

ఇంతకీ ఆమెకి అర్థంకాని సమస్య ఒకటి – మూర్తికి తెలిసే అడిగాడా? లేదా? అనేది ఆమె అర్థంచేసుకోలేక పోతోంది

అసలు పెళ్ళినాటి తొలిరాత్రి తన పెన్ ఫ్రెండ్ విషయం చెప్పాలనుకుంది సుమతి ఆ రాత్రి ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు – స్నేహితుల్లాగా అప్పుడే ఆవిషయం నోటిదాకా వచ్చి ఆగిపోయింది. ఆ పెన్ ఫ్రెండ్ స్నేహం మానుకుని అప్పటికే యేడాది గడిచి పోయింది అనవసరంగా ఎందుకు చెప్పటం? అనుకుని మౌనంగా వుండిపోయింది సుమతి

కాని ఈరోజు మూర్తి ఇట్లా అడిగేసరికి– ఆరోజు చెప్పనందుకు పశ్చాత్తాప పడుతోంది సుమతి

తెల్లవారి మూర్తి ఆఫీసుకు వెళ్ళే వరకు – నిద్రకళ్ళతో అన్య మనస్కంగానే వుండి పోయింది సుమతి.

ఎంతగా ఆ జ్ఞాపకాలను చెరిపి వేయాలనుకున్నా సాధ్యం కావట్లేదు అట్లాగే గదపలో కూచొని వుండి పోయింది సుమతి మనసు మాత్రం గతంలోకి పరుగులు తీసింది

* * * * *

సుమతి పదో తరగతి చదువుతున్న రోజులవి సుమతి ఎవ్వరితో నూ కలిసేది కాదు ఆ సంవత్సరమే వాళ్ళ నాన్నకు ట్రాన్స్‌ఫర్ అయి తాడేపల్లి గూడెం వచ్చారు రాగానే సుమతి పదో తరగతిలో చేరింది

వూరు కొత్త – స్కూలు క్రొత్త

అందుకే ఇంటి దగ్గర తలదించితే స్కూలు దగ్గర తల యెత్తేది ఎవ్వరితోనూ పూసుకుని తిరిగేది కాదు అంటీ అంటనట్టు వుండేది తోటి వాళ్ళు కూడా అట్లాగే వుండేవాళ్ళు ఆ రోజుల్లో సుమతికి చెప్పుకో తగ్గ స్నేహితురాలంటూ వుంటే– అది ఒక్క విజయ మాత్రమే

నెల్లూరులో వున్నప్పుడు విజయ, సుమతి కలిసి స్కూలుకు వెళ్ళేవాళ్ళు కలిసి చదువుకునే వాళ్ళు– ఆడుకునే వాళ్ళు తాడేపల్లి గూడెం వొచ్చేశాక – అప్పుడప్పుడూ విజయ వుత్తరాలు రాస్తుండేది

ఆ వుత్తరాల కోసం ఆశగా ఎదురు చూస్తుండేది సుమతి

ఒక రోజు – విచిత్రమైన వుత్తరం వొచ్చింది

ఆశ్చర్యంతో వుత్తరం చూసింది సుమతి

నెల్లూరు

18–2–80

సమయం : సాయంత్రం 4గ 59 ని లు

సుమతికి –

ప్రేమతో 'శైలు'

ఎవరబ్బా! ఈ శైలు? అని ఆశ్చర్య పడుతున్నారుకదూ! పడకండి చెప్పేస్తున్నాను నేను ఇంటర్ చదూతున్నాను నా పేరు శైలజ ముద్దు పేరు శైలు ఉదయం కాలేజికి వెళ్తుంటే దారిలో ఓ ఇన్‌లాండ్ కవర్ పడివుంది తీసి చూద్దును కదా! ఎవరో విజయట – మీకు రాసిన వుత్తరం ఆ మహాతల్లి అంటించను కూడా అంటించకుండా దార్లో పడేసుకుంది బహుశా పుస్తకం లోంచి జారి పడివుంటుంది ఆ అమ్మాయిని శిక్షించకండి ఆ వుత్తరాన్ని అట్లాగే పోస్ట్ చేద్దామను కున్నాను కాని ఎందుకో తెలీదు – మీతో పరిచయం చేసుకోవాలని పించింది అందుకే ఆవుత్తరం కూడా ఈ కవర్లో పెట్టి పంపి స్తున్నాను

మీకు తీరిగ్గా వుంటే, మీకు ఇష్టమైతే – నాతో స్నేహం చెయ్యవచ్చు లేకుంటే గుడ్‌బై

పెన్ ఫ్రెండ్

శైలు –

సుమతికి ఒక్క క్షణం ఆ వుత్తరం అర్థం కాలేదు మళ్ళీ మళ్ళీ చదువుకుంది మనసారా నవ్వుకుంది ఆ వుత్తరాన్ని ఎన్నిసార్లు చదివిందో! ముత్యాల గుంపుల్లా అందంగా వున్న అక్షరాలు, దానికి తోడు ఆ అమ్మాయి రాసిన విధానం – సుమతికి ఎంతగానో నచ్చింది

శైలజ అడ్రెస్ కోసం వుత్తరమంతా వెదికింది ఎక్కడా కనిపించలేదు కవర్ వెనక వైపు వున్న అడ్రెస్ చూసి 'హమ్మయ్య' అనుకుంది సుమతి

ఆ రోజే శైలజకి వుత్తరం రాసేసింది సుమతి

ఆ విధంగా చిత్రంగా పరిచయమైన స్నేహం కొద్ది రోజుల్లోనే గాఢంగా అల్లుకుని పోయింది కొంత కాలం పోస్టల్ డిపార్ట్ మెంట్‌కు రాజ–పోషకులైనారు

ఎన్ని వుత్తరాలు–

ఎన్ని మాటలు–

ఎంత నవ్వులు!

వాళ్ళిద్దరి మధ్య ప్రతి వుత్తరం నిత్య నూతనంగా వుండేది శైలు రాసే వుత్తరం కొరకు చకోరంలా ఎదురు చూసేది సుమతి

శైలు వుత్తరం వొస్తే చాలు – సుమతి మరో లోకంలోకి వెళ్ళిపోయేది ఒంటరిగా కూచొని ఎన్ని, సార్లు ప్రేమగా చదూకునేదో! శైలు వుత్తరాలు ఎంతో హృద్యంగా, ఎదుట నిలిచి పలకరించినట్లే వుండేవి అంత చక్కగా వుత్తరాలు వ్రాయటం మరెవ్వరికీ సాధ్యం కాదని పించేది

శైలు వుత్తరాల వల్లనే మంచి మంచి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంది సుమతి తిరిగి వుత్తరం రాశాక రోజులు లెక్కపెడుతూ కూచొనేది

తెలీకుండానే కాలచక్రం గిర్రున తిరిగి పోయింది

సుమతి డిగ్రీలో చేరింది శైలు నుంచి వుత్తరాలు రావటం మాత్రం ఆగలేదు ప్రతి వుత్తరం ఒక చక్కని కవితలాగ, కథలాగా వుండేది

ఈ మధ్యకాలంలో విజయ వుత్తరాలు రాయటం తగ్గించేసింది సుమతి కూడా పెద్దగా పట్టించుకోలేదు ఆ స్నేహం అట్లాగే ముగిసి

పోయింది

శైలజ వుత్తరం రాయటం ఒక్కరోజు ఆలస్యమైతే చాలు– సుమతి వెంటనే కోపంగా వుత్తరం రాసేది వారిద్దరి మధ్య పోస్ట్‌మేన్ తిరగలేక చచ్చేవాడు పాపం!

ఆ మాటే శైలు వ్రాస్తే – సుమతి పకపకా నవ్వుతునేది– చిన్న పిల్లలా

ఒకసారి శైలజ –స్నేహం కోసం ప్రాణం అర్పించడం అంత కష్టమేమీ కాదు గాని అందుకు అర్హులైన స్నేహితులు మాత్రం లభించరు అని రాస్తే–

నాకు మాత్రం నువ్వు వున్నావు అని సుమతి రిప్లై యిచ్చింది

వయసు పెరిగే కొద్దీ శైలజ మీద మమకారం మరింత పెరగ సాగింది ఏ చిన్నపని చెయ్యాలన్నా, ఆఖరికి ఏ సినిమా చూడాలన్నా– శైలజ అభిప్రాయంతో నే చేసేది

ఎక్కడ నెల్లూరు?

ఎక్కడి తాడేపల్లి గూడెం?'

నిజమైన స్నేహానికి కుల మతాలే కాదు– దూరబారాలు కూడ అడ్డురావని నిరూపించింది వాళ్ళ స్నేహం

ఆజన్మాంతం స్నేహితులుగానే వుండాలని, స్నేహమంటే ఎంత తియ్యనిదో, వున్నత మైనదో తామే నిరూపించాలని ఎన్నో ఆశలు చేసుకున్న వాళ్ళ స్నేహంలో వూహించని అపశృతి పలికింది

సుమతి డిగ్రీ ఆఖరు సంవత్సరం చదువుతోంది రెండు వుత్తరాలు రాసినా శైలజ సమాధానం వ్రాయలేదు మరోసారి గట్టిగా వుత్తరం రాసింది సుమతి

అప్పుడు వొచ్చింది శైలజ రాసిన భయంకరమైన వుత్తరం తనపేరు శైలజ కాదని, శాయి మోహన్ అని– చిన్నతనంలో తమాషాగా వ్రాసిన వుత్తరం ద్వారా నీలాంటి మంచి ఫ్రెండ్‌ని పొందానని, తను చేస్తున్న పని తనకే నచ్చలేదని కాని ఏ స్వార్థమూ లేని తను అయాచితంగా లభించిన అమూల్యమైన స్నేహితురాల్ని వొదులు కోవటం ఇష్టం లేక– ఇంతకాలం శైలజగానే నటించానని, ఇంకా చెప్పక పోవటం ద్రోహం అవుతుందని– ఎదిగిన మనసుతో క్షమించగలిగితే ఈ స్నేహం ఇట్లాగే కొనసాగిద్దామని – ఆ వుత్తరం యొక్క సారాంశం

అది చదివి మ్రాన్పడి పోయింది సుమతి ఒక్కసారిగా ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు తిరిగాయి

ఎంత ద్రోహం? అనుకుంది


రెండు రోజులు తిండి కూడా తినలేదు వూహించని ఈ సమస్యతో ఎంతో ఆవేదన అనుభవించి చివరకు ఓ నిర్ణయానికి వొచ్చింది

శైలజ అని నమ్మించి మోసం చేసిన శాయి మోహన్ గారికి–

కృతజ్ఞురాలిని – ఇప్పటికైనా నిజం చెప్పినందుకు ఇంతకాలం నాతో అమ్మాయిగా స్నేహం చేసి ఈ రోజు హఠాత్తుగా నిజం బైట పెట్టడం ద్వారా మీ గొప్పతనాన్ని, నిజాయితీని గుర్తించి మీతో తిరిగి స్నేహం కొనసాగిస్తానని అనుకుంటే మీ భ్రమ

అబ్బాయిలతో స్నేహం చేసే హైక్లాసు ఆడపిల్లను కాదు నేను మధ్య తరగతి కుటుంబంలోని ఓ అమ్మాయిని ఒకవేళ స్నేహం చేసే స్వేచ్ఛ వున్నా– మీరు చేసిన పనికి మీతో స్నేహం చేసేదాన్ని కాదని నిర్మొహ మాటంగా చెప్తున్నాను

మీరు చక్కగా వుత్తరాలు వ్రాయగలరు మంచి, మాటలతో దగ్గర కాగల నేర్పు కూడ మీలో నిండుగావుంది కానీ ఇలాంటి ద్రోహం చేయటానికి ఆ నైపుణ్యాన్ని దయచేసి వినియోగించవద్దు మీరు



చేసింది నా దృష్టిలో ద్రోహమే అన్నెం పున్నెం తెలీని ఓ చిన్నారి పాపతో యవ్వనం వరకు స్నేహించి నమ్మించి – చివరకు నేను మగాణ్ని అని చెప్పటం ద్రోహం కాదా?

దయచేసి ఈ వుత్తరానికి రిప్లై ఇవ్వకండి మీరు ఏమి చెప్పినా వినే ఓపిక నాలో లేదు మరెప్పుడూ నాకు వుత్తరాలు రాయకండి అంతేకాదు – మరే ఆడపిల్లను ఇట్లా మోసం చెయ్యకండి గుడ్‌బై"–

అని వుత్తరం రాసేసింది

నిజంగా సుమతి ఎంత క్లేశాన్ని అనుభవించిందో– అంత కంటె యెక్కువ కోపం కూడ ఏర్పడింది చాలా రోజుల వరకు ఆలోచనలు వొదలకండా వుండిపోయాయి

ఆ తర్వాత కూడా మరిచిపోగలిగేది కాదు గానీ– అతని మీద ఏర్పడిన ద్వేషం, కోపం వలన త్వరగానే ఆ జ్ఞాపకాలను తుడిచి వేసింది

ఆ రోజుల్లో తను రాసిన వుత్తరాలు స్నేహితులందరికి చూపించుకుని గొప్పలు చెప్పుకుని నవ్వుకుని వుంటాడని వూహించి– అతనన్నా, కలం స్నేహం అన్నా ఒక విధమైన జుగుప్స కలిగింది

అందుకనే ఆ జ్ఞాపకాలను మరెప్పుడూ దగ్గరకు రానీకుండా జాగ్రత్త పడింది

తర్వాత కాలేజి చదువు ఐపోవటం, పెళ్ళి జీవితం ఒక విధంగా ఆ సంఘటన మరిచి పోయింది

ఇన్నాళ్ల తర్వాత భర్త అడిగిన ప్రశ్నతో ఆ జ్ఞాపకాలన్ని కదలాడాయి

అసలు ఈ సంగతి భర్తకు చెప్పాలా? వొద్దా? అనే మీమాంసలో పడిపోయింది

మళ్ళీ తనకి తానే సమాధానం చెప్పుకుంది

చెప్తే తప్పు ఏముంది? తను ఏం తప్పు చేసింది ఏదో ఒకరోజు తెలిసి అతను అపార్థం చేసుకోకముందే తను చెప్తే మంచిది అదీగాక ఆయనకై ఆయనే అడిగినప్పుడు ఇహ దాచటం అనవసరం

జరిగింది జరిగినట్లు భర్తకు చెప్పటానికే నిశ్చయించుకుని తేలికపడ్డ మనసుతో భర్త రాకకై ఎదురు చూడ సాగింది సుమతి

* * * * *

# "పెన్‌ఫ్రెండ్"

సుమతి పాల గ్లాసుతో వెళ్ళే సరికి మూర్తి ఏదో నవల చదువుతూ పడుకుని వున్నాడు

పాలగ్లాసు టేబుల్ మీద పెట్టి భర్త ప్రక్కగా కూచొంది సుమతి మూర్తి నవల ప్రక్కన పడేసి సుమతి నడుము చుట్టూ చేతులు బిగించాడు

సుమతిలో చలనం లేదు

"మీకో విషయం చెప్పాలండి అంది

ఏదైనా విశేషమా? నవ్వుతో మరింత దగ్గరైనాడు మూర్తి

'రాత్రి మీకు అబద్ధం చెప్పాను

ఏమిటో యి! సరిగా చెప్పరాదూ

'నాకో పెన్ ఫ్రెండ్ వున్నారు

చాలా గొప్ప ...యం చెప్పావ్ అంతేనా అన్నాడు తేలిగ్గా మూర్తి

ఆ పెన్ ఫ్రెండ్ అమ్మాయి కాదు– ఓ మగాడు" కసిగా అంది సుమతి

మూర్తి మౌనంగా వుండి పోయేడు

భర్త మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకుని సుమతి చెప్పసాగింది

నా చిన్న తనంలో అమ్మాయి పేరుతో పరిచయమై ఐదేళ్ళు నాతో వుత్తరాల ద్వారా స్నేహం చేసి చివరకు నేను అమ్మాయిని కాదు అబ్బాయిని అని నన్ను మోసం చేశాడు అతను వెంటనే ఘాటుగా రిప్లై యిచ్చాను నా డిగ్రీ పూర్తయ్యే సరికి "మా స్నేహం కూడ పూర్తయి పోయింది ఆ నమ్మక ద్రోహిని తలుచుకోవటం ఇష్టం లేక ఆ జ్ఞాపకాలను కూడ మనసులో నుంచి చెరిపి వేశాను

రాత్రి మీరు అడిగితే తటాలున ఆ నిజం చెప్పలేక పోయేను నన్ను క్షమించండి సుమతి కళ్ళు వర్షించటానికి సిద్ధంగా వున్నై

మూర్తి శాంతంగా అన్నాడు

'పిచ్చి పిల్లా! ఇందులో బాధ పడవలసిన అవసరం ఏముంది? ఒక వేళ అతను కూడ నిస్వార్థంగానే అట్లా వ్రాశాడేమో!

లేదండీ! అతను మంచివాడే అయితే అంతకాలం ఆ నిజాన్ని దాచవలసిన అవసరం లేదు అంతకాలం నమ్మించటం ఎందుకు?"

నిజమే! ఇంతకీ అతను మంచివాడు కాదంటావ్"

మంచివాడు కాక పోవటమే కాదు మోసగాడుకూడా"

"మోహన్ అలాంటి వాడు కాదు నవ్వుతో అన్నాడు మూర్తి

సుమతి బిత్తర పోయింది

మీకు తెలుసా?"

బాగా తెలుసు అంతేకాదు సుమతి లాంటి అమ్మాయికి భర్తనయ్యే అదృష్టం కలిగించింది కూడా వాడే

సుమతి విశాల నయనాలు 'ఆశ్చర్యంతో మరింత పెద్దవై, తళుక్కు మన్నాయి

మోహన్ నాకు 'బెస్ట్ ఫ్రెండ్ పెళ్ళి చూపులకని నెల్లూరు వెళ్ళినపుడు వాణ్ణి కలిశాను అప్పుడే నీ గురించి తెలిసింది నువ్వు రాసిన వుత్తరాలన్నీ చూపించాడు మీ పరిచయం పూర్తిగా చెప్పాడు 'తెలివైన అమ్మాయిలు ఈ రోజుల్లో దొరకటం కష్టం సుమతిని నేను కూడ చూడలేదు నీకు నచ్చితే – ఇద్దరూ అదృష్ట వంతులవుతారు' అన్నాడు

ఆ రోజు మోహన్ నీ గురించి చెప్పకుండా వుంటే ఇంత పెద్ద లోకంలో నువ్వెవరో! నేనెవరో!"

సుమతి ప్రతిమలా వింటూ వుంది

మన పెళ్ళి క్కూడ వొచ్చాడు తన గురించి మాత్రం చెబితే స్నేహం మానుకో వలసి వొస్తుందని షరతు పెట్టేడు నేనుగా చెప్పనని వాడితో ఒట్టు పెట్టాను ఈ రోజు నువ్వే చెప్పావు కాబట్టి పూర్తిగా చెప్పేశాను మోహన్ నిజంగా మంచి స్నేహితుడు సుమతీ అరుదుగా లభించే స్నేహ మాధుర్యం అతని దగ్గర మాత్రమే వుందా అనిపిస్తుంది నాకు

నీ విషయంలో జరిగింది పొరపాటు కాని మోసం కాదు మోహన్ మాత్రం నీ అభిప్రాయమే కరెక్ట్ అంటాడు ఇప్పుడు చెప్పు – మోహన్ ఎలాంటివాడు?"

సుమతి సమాధానం చెప్పలేదు కన్నీళ్ళు జలజల రాలాయి

ఛ ఛ ఏమిటి చిన్న పిల్లలా? అంటూ ఆమె చెక్కిళ్ళు చేత్తో తుడిచాడు మూర్తి

నిజమైన స్నేహితుడిగా తనకి ఎంతో మేలు చేసిన మోహన్‌ని అపార్థం చేసుకున్నందుకు సుమతి బాగా అప్‌సెట్ ఐపోయింది

లోకంలో స్నేహాన్ని స్వార్థానికి వాడుకునే వాళ్ళే గాని– అందులో ఆడపిల్లతో స్నేహమైతే మరి చెప్పనక్కరలేదు స్నేహానికి నిజమైన విలువ యిచ్చే వాళ్ళు కూడా వుంటారని, పెన్ ఫ్రెండ్స్‌లో కూడావుంటారని సుమతి వూహించ లేక పోంది

అతనిప్పుడు ఎక్కడ వుంటున్నారు' చాలాసేపు తర్వాత నెమ్మదిగా అడిగింది

"విజయవాడ బ్యాంక్‌లో ఉద్యోగం

సుమతిని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ–

'మోహన్ని మన ఇంటికి పిలుద్దామా'! అన్నాడు మూర్తి

తప్పకుండా' అంది సుమతి – కృతజ్ఞత నిండిన మనసుతో □

